సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 13 । జనవరి । 2025



శ్రీవారి క్షేత్రం ముస్తాబు

సంక్రాంతి వేడుకలకు ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో ఆలయం, ప్రాంగణాలు మిరుమిట్లుగొలుపుతున్నాయి. 10లో



ఏలూరులో భారీ చోరీ

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ జ్యూయలరీ షాపులో భారీ చోరీ జరిగింది. దుండగులు షాపు వెనుక గోడకు రంధ్రం చేసుకుని లోనికి ప్రవేశించారు. 10లో

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సంక్రాంతితో ప్రతి ఇంటా సిరిసంపదలు వెల్లివిరియాలని ఆమె ఆకాంక్షించారు.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాలపై దాడులు



ఏలూరులో మద్యం దుకాణం వద్ద సిట్టింగ్ లేకుండా చర్యలు తీసుకున్న దృశ్యం

సాక్షి స్పందన

ఏలూరు టౌన్ : ఏలూరులో మద్యం దుకాణాలపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన 'లిక్కర్ షాపుల ఇష్టారాజ్యం' కథనంపై ఎక్సైజ్ అధికారులు స్పందించారు. పలు మద్యం దుకాణాలపై దాడులు చేశారు. ఉదయం జిల్లాలో ఎక్సైజ్ అధికారులతో డిప్యూటీ కమిషనర్ శ్రీలత సమీక్షించారు. నిబంధనలు మీరితే మద్యం షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని పంపుల చెరువు సమీపంలోని మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన సిట్టింగ్‌ను ఎక్సైజ్ సీఐ ధనరాజు తొలగించారు. షాపు నిర్వాహకులను హెచ్చరించారు.

ప్రభుత్వం ధాన్యం కొనకపోవడం దారుణం

భీమవరం: జిల్లాలో లక్ష్యం పూర్తయిందని 15 రోజులుగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సార్వా సీజన్‌లో ప్రకృతి విపత్తులతో పంట ఆలస్యం కావడంతో దిగుబడులు తగ్గాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని తెలిపారు. జిల్లాలో ప్రధానంగా పోడూరు, యలమంచిలి, పాలకొల్లు ఆచంట, వీరవాసరం, భీమవరం, అత్తిలి మండలాల్లో సుమారు 30 వేల టన్నులకు పైగా ధాన్యం రైతుల వద్ద ఉందని పేర్కొన్నారు. ధాన్యం కొనకపోవడంతో దాళ్వా పెట్టుబడులతో పాటు కనీసం సంక్రాంతి పండుగ చేసుకునేందుకు సొమ్ములు లేక రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు. ఇదే అదనుగా దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

2,692 బైండోవర్ కేసులు



బరులను ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లావ్యాప్తంగా సంక్రాంతి కోడిపందేలకు బరులు సిద్ధమవుతుండగా.. పందేలు, జూదక్రీడల నియంత్రణకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటివరకూ 2692 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో 110కి పైగా బరులు ఏర్పాటుచేసినట్టు గుర్తించి 50కి పైగా బరులను ధ్వంసం చేశారు. 86 మందికి స్థలాలు ఇవ్వకూడదంటూ నోటీసులు జారీ చేశారు. సుమారు 2,354 కోడికత్తులను, 29 కోళ్లు, 4 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడుల్లో రూ.4 లక్షల 59 వేల 170 నగదును సీజ్ చేశారు. మరో రెండు కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో మొత్తంగా 228 మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు.

16న డీఆర్‌సీ సమావేశం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం ఈనెల 16న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా అధికారులు పాల్గొంటారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, భూసేకరణ, ఆర్అండ్ఆర్, దీపం, ధాన్యం కొనుగోలు, ఇండస్ట్రియల్ పార్కులకు భూమి లభ్యత, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన అంశాలపై సమీక్షిస్తారు.

అక్రమ మద్యం రవాణాపై నిఘా

తాడేపల్లిగూడెం: మద్యం అక్రమ రవాణా చేసినా, బెల్టు షాపులు నిర్వహించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అక్రమ మద్యం కట్టడిపై దృష్టి సారించామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తామన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు 56 బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేసి, 52 మందిని అరెస్టు చేశామన్నారు. 110.8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఆమె చెప్పారు.

పైసల్లేవ్.. పండుగెక్కడ!

ఊరు ఉసూరు

- చిన్నబోయిన సంక్రాంతి
- పల్లెల్లో కాంతులు కరువు
- వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెల
- డబ్బుల్లేక పండుగలకు దూరంగా ప్రజలు
- మంచిలిలో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

పంటకు పెట్టుబడులు పెట్టడానికే సొమ్ములు లేకుంటే పండుగంటారేంటంటున్న రైతులు.. డబ్బులు ఉంటేనే కదా కొత్త బట్టలు కొనుక్కునేది.. ధరలకు జడిసి పిండి వంటలు జోలికి పోలేదు.. కనీసం సంక్రాంతికి చంద్రన్న కానుకగా సరుకులు ఇస్తారనుకుంటే అవీ లేవు.. ఇంటికి వచ్చిన మనవళ్లకు చేతిలో పెట్టేందుకు చిల్లిగవ్వ లేకుండా పోయిందంటున్న గృహిణులు.. ఊరిలో మొదటి కిరాణా షాపు మాదే.. వ్యాపారాలు ఎప్పుడూ ఇంత దారుణంగా లేవంటున్న వ్యాపారి.. జిల్లాలో పూతరేకుల తయారీకి ప్రసిద్ధి చెందిన అత్తిలి మండలం మంచిలిలో వివిధ వర్గాల అభిప్రాయమిది. ఊరంతా చెబుతోంది ఒక్కటే 'ఈ ఏడాది అసలు పెద్ద పండుగలానే లేదని'.

– సాక్షి, భీమవరం/ అత్తిలి



అత్తిలి మండలం మంచిలి గ్రామం

అత్తిలి మండలం మంచిలి గ్రామంలో 14 వార్డులు 5,850 జనాభా ఉన్నారు. 1,968 కుటుంబాలకు గాను 3870 మంది ఓటర్లు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ కేటగిరీలకు చెందిన దాదాపు 26 సామాజిక వర్గాలవారు నివసిస్తున్నారు. 1,200 ఎకరాల ఆయకట్టుతో వ్యవసాయాధారితమైన ఈ గ్రామం పూతరేకుల తయారీకి పేరొందింది. 16 వరకు పూతరేకుల దుకాణాలు ఉండగా, 250 కుటుంబాలకు చెందిన మహిళలు ఇంటి వద్ద రేకుల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. గ్రామంలో ఆరు వరకు హోల్‌సేల్, రిటైల్ కిరాణా దుకాణాలు ఉండగా క్లాత్, రెడీమేడ్ షాపులు మూడు ఉన్నాయి. పది వరకు బడ్డీ కొట్లు ఉన్నాయి. ఎక్కువగా షాపింగ్ చేయాలంటే మండల కేంద్రమైన అత్తిలి, నియోజకవర్గ కేంద్రమైన తణుకు తప్పితే చాలా వరకు గ్రామంలోని దుకాణాల వద్దనే కొనుగోళ్లు చేస్తుంటారు. సాధారణ రోజుల్లో హోల్‌సేల్ కిరాణా దుకాణాల వద్ద రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు, పండుగ రోజుల్లో రూ.20 వేల వరకు వ్యాపారం జరుగుతుంది. పెద్ద పండుగ సీజన్‌లో మొత్తంగా రూ.15 లక్షల వరకు వస్త్ర, రూ.20 లక్షల వరకు పూతరేకులు, పిండి వంటల వ్యాపారం జరుగుతుంది.

కళాకాంతులు లేవు

'సాక్షి' విలేజ్ విజిట్‌లో ఆదివారం గ్రామంలో పర్యటించినప్పుడూ ఎక్కడా పండుగ హడావుడి కనిపించలేదు. వినియోగదారులు లేక దుకాణాలు వెలవెలబోయాయి. ఎవరిని కదిలించినా గత ప్రభుత్వంలో ప్రతినెలా ఏదో ఒక సంక్షేమ పథకాలు వచ్చి అందరి చేతుల్లో డబ్బులు ఆడేవి, కొత్త ప్రభుత్వం వచ్చాక ఏమీ రాకపోగా నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు చార్జీలు పెరిగిపోవడంతో కష్టంగా ఉందని మహిళలు చెబుతుంటే.. చాలా రోజులు ఇసుక దొరక్క పనుల్లేక ఖాళీగా ఉండి అప్పులు చేసుకుని తిన్నామని కార్మికులు అంటున్నారు. భారీ వర్షాలకు 300 ఎకరాలకు పైగా నష్టం వాటిల్లితే కేవలం 60 ఎకరాలకు మాత్రమే రూ.6 లక్షల ఇన్‌పుట్ సాయం అందించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల బీమా పరిహారం, అన్నదాత సుఖీభవ సాయం అందకపోవడం, పంట తెగుళ్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సగటు దిగబడి 30 బస్తాలకు తగ్గిపోవడంతో పెట్టుబడులు కూడా దక్కక తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. ఈ ఏడాది పరిస్థితి బాలేక పండుగలు సరిగా జరుపుకోలేకపోతున్నామని అన్నారు. కొందరు అప్పులు చేసి కొత్త బట్టలు, కావాల్సిన సరుకులు కొనుగోలు చేసుకోగా మరికొందరు పండుగను సరిగా చేసుకోలేకపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

2023లో పథకాల ద్వారా గ్రామస్తులకు చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	సాయం (రూ.లక్షల్లో)
జగనన్న అమ్మఒడి	415	54.47
జగనన్న వసతి దీవెన	113	20.8
జగనన్న విద్యాదీవెన	113	54.47
జగనన్న విదేశీ విద్యాదీవెన	1	26.50
వైఎస్సార్ రైతు భరోసా	771	104.00
ఉచిత పంటల బీమా	477	138.00
ఇన్‌పుట్ సబ్సిడీ	140	8.35
సున్నా వడ్డీ రుణాలు	1,062	30.25
వైఎస్సార్ పెన్షన్ కానుక	731	204.00
వైఎస్సార్ చేయూత	269	50.43
వైఎస్సార్ ఆసరా	1,170	95.54
వైఎస్సార్ బీమా	7	7.00
వైఎస్సార్ కాపు నేస్తం	84	12.60
జగనన్న చేదోడు	37	3.07
వైఎస్సార్ వాహనమిత్ర	20	2.00
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	92	4.60
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	98	14.7
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	92	4.65
వైఎస్సార్ కల్యాణమస్తు	3	2.25
హౌసింగ్	200	135.00

మునుపటి ఏడాది కోట్లలో లబ్ధి

2023లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో సుమారు 5,895 మంది లబ్ధిదారులకు సుమారు రూ.7.7 కోట్ల లబ్ధి చేకూరింది. గతేడాది మొదటి రెండు నెలల్లో పలు పథకాల ద్వారా సాయం అందగా మార్చి నెలలో ఎన్నికల కోడ్ రావడంతో పథకాలకు బ్రేక్ పడింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్ రూ.వెయ్యి పెంచడం, ఏడాదికి మూడని చెప్పి ఒక ఉచిత సిలెండర్‌కు పరిమితం చేయడం మినహా సూపర్ సిక్స్ హామీలను అమల్లోకి తీసుకురాలేదు.

సంక్రాంతి సంబరాలు లేవు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల పరిధిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగేవి. ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించేవారు. ఇప్పుడు వాటి ఊసేలేదు. ఎక్కడా సంక్రాంతి సందడి కనిపించడం లేదు.

– దారం శిరీష, వైస్ ఎంపీపీ, మంచిలి

40 శాతం అమ్మకాలు తగ్గాయి



గ్రామంలో మాదే మొదటి కిరాణా దుకాణం. 40 ఏళ్లగా షాపు నడుపుతున్నాను. వస్త్ర, కిరాణా వ్యాపారాలు ఎప్పుడూ ఇంత దారుణంగా లేవు. గతేడాదితో పోలిస్తే 40 శాతం అమ్మకాలు కూడా జరగడం లేదు.

– వేంద్ర సత్యనారాయణ, కిరాణ వ్యాపారి

అన్నీ ఆగిపోయాయి



గతంలో నా భార్యకు చేయూత, ఆసరా, నాకు రైతు భరోసా సాయం అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక అవేమీ అందలేదు. కనీసం సంక్రాంతికి గతంలోలా చంద్రన్న కానుకగా సరుకులు ఇస్తారనుకుంటే అవీ లేవు.

–కేదా కొండలరావు, రైతు

గడవడమే కష్టంగా..



గతంలో ఏడాది పొడవునా ఏదోక పథకం రూపంలో చేతిలో డబ్బులు ఆడేవి. వాటితో పండుగలు, పబ్బాలకు పిల్లలు, మనవళ్లకు డబ్బులు ఇచ్చేవాళ్లం. ఇప్పుడు మాకు గడవడమే కష్టంగా ఉంది.

–వెంపటాపు పైడమ్మ, గృహిణి

ధరలు బాగా పెరిగాయి



నిత్యావసరాల ధరలు బాగా పెరిగాయి. నూనె రూ.120 నుంచి రూ.160, నూకల బస్తా రూ.600ల నుంచి రూ.910లకు పెరిగి ఆదాయం తగ్గింది. గతంలో నాకు అమ్మఒడి, ఆసరా అందేవి. ఇప్పుడవేమీ లేవు.

– కె.యశోద, గృహిణి

అమ్మకాలు లేవు



గతంలో క్రిస్మస్ నుంచి సంక్రాంతి వరకు రూ.4 లక్షల వరకు వస్త్ర వ్యాపారం జరిగితే ఇప్పుడు మాల్స్ రావడం, జనం దగ్గర డబ్బుల్లేక రూ.30 వేలు కూడా అమ్మలేదు. తెచ్చిన స్టాకును ఏం చేయాలో అర్థం కావడం లేదు.

–కాసా పావయ్య, వస్త్ర వ్యాపారి

కొత్త బట్టలు కొనలేదు



ఈ ఏడాది డబ్బుల్లేక కొత్త బట్టలు కొనుక్కోలేకపోయాం. పిండి వంటలు చేసుకోలేదు. అసలు పండగలానే లేకుండా పోయింది. పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాం. మా పిల్లలకు అమ్మఒడి అన్నీ ఆగిపోయాయి.

–జి.నాగేశ్వరమ్మ, గృహిణి

సంక్రాంతి హడావుడి లేదు



పండుగ వస్తోందంటే గ్రామంలో సందడిగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చాక పథకాలను ఆపేయడంతో జనం వద్ద డబ్బులు లేవు. దీనికితోడు నిత్యావసర ధరలు పెరిగిపోయి పేదవర్గాల జీవనం దుర్భరంగా మారింది.

– రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, గ్రామ ప్రముఖుడు

పరిహారం ఇవ్వలేదు



1.2 ఎకరాల్లో తొలకరి నాట్లు వేస్తే భారీ వర్షాలతో పంట దెబ్బతింది. రెండోసారి వేసిన నాట్లకు అదే పరిస్థితి ఎదురైంది. పెట్టుబడులు రూ.20 వేలు నష్టపోయాను. కనీసం కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించలేదు.

– సత్తి తాతారెడ్డి, కౌలు రైతు

కాదేదీ అమ్మకానికి అనర్హం



కాదేదీ వ్యాపారానికి అనర్హం అన్నట్టు ఉంది పరిస్థితి. సంక్రాంతి సందర్భంగా భీమవరంలో భోగి పిడకల అమ్మకాలే ఇందుకు నిదర్శనం. పట్టణాల్లో గోవుల సంఖ్య తగ్గిపోవడం, పేడ దొరకడం కష్టమవడంతో భోగి పిడకలకు డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు ఆవుల యజమానులు, రైతులు భోగి పిడకలు తయారుచేసి దండలుగా కూర్చి అమ్ముతున్నారు. దండ రూ.25 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. భీమవరంలో కనిపించిన దృశ్యమిది.

– భీమవరం

నేటి నుంచి మావుళ్లమ్మ ఉత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ 61వ జాతర మహోత్సవాలను సోమవారం నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుచే మధ్యాహ్నం గ్రామోత్సవం, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డితో సాయంత్రం ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. ఆఖరి రోజు మహా అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సుమారు రూ.90 లక్షలతో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం చుట్టూ ప్రత్యేక లైటింగ్ సెట్టింగ్‌లను ఏర్పాటుచేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 24 పౌరాణిక నాటకాలు, 5 బుర్రకథలు, 9 హరికథలు, 14 సంగీత విభావరి, మ్యూజికల్ నైట్స్, 22 కూచిపూడి నత్య ప్రదర్శనలు ఏర్పాటుచేశామని చెప్పారు. అనంతరం అమ్మవారి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.



భీమవరంలో మావుళ్లమ్మవారి ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

6 నుంచి అష్టలక్ష్మి అలంకరణలు

ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 6 నుంచి 14 వరకు అమ్మవారికి అష్టలక్ష్మి అలంకరణ చేయనున్నారు. 6న ఆదిలక్ష్మి, 7న ధాన్యలక్ష్మి, 8న ధైర్యలక్ష్మి , 9న గజలక్ష్మి , 10న సంతానలక్ష్మి , 11న విజయలక్ష్మి , 12న విద్యాలక్ష్మి , 13న ధనలక్ష్మి, 14న అన్నపూర్ణ దేవిగా అలంకరణలు చేస్తారు. కార్యక్రమంలో నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ సభ్యులు తుటారపు ఏడుకొండలు, రామాయణం గోవిందరావు, కొప్పుల సత్తిబాబు, రామాయణం చిన్నారి, కట్టా కొండ, నరహరిశెట్టి సూర్యనారాయణ, రామాయణం శ్రీనివాసరావు, మానే భాస్కరరావు, మానే తేజ, ఆకుల సోమేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, శిలాఫలకాల ధ్వంసం



హోర్డింగులను డ్రైనేజీలో పడవేసిన దృశ్యం



అలుగులుగూడెంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఏలూరు జిల్లా దెందులూరు గ్రామ పంచాయతీ శివారు అలుగులగూడెంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, శిలాఫలకాలను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. తొలగించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను పక్కనే ఉన్న మురుగు కాల్వలో పడవేశారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఫొటోలు, అభివృద్ధి వివరాలతో రెండు శిలాఫలకాలను గ్రామంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ఏడు నెలల తర్వాత రెండు శిలాఫలకాలను, ఫ్లెక్సీలను, హోర్డింగులను ధ్వంసం చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ హోర్డింగులు, శిలాఫలకాలను ధ్వంసం చేయడం బాధాకరమని, ఇది సరైన సంప్రదాయం కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, సొసైటీ మాజీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కమిటీ కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, కొంగర రత్నకుమార్, వార్డు సభ్యురాలు ప్రసన్నరాణి, రవి, గంటా పండు తదితరులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలోనూ, ప్రతి శివారు ప్రాంతంలోనూ ఆ పార్టీల శ్రేణులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు.

విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేయండి

భీమవరం : విద్యుత్ చార్జీల భారాలు మోపుతున్న ప్రభుత్వ చర్యలకు నిరసనగా ప్రజలు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి, రాష్ట్ర ప్రభుత్వం 2025–26లో భారాలు లేవంటూనే సర్దుబాటు చార్జీల ద్వారా వేలాది కోట్ల రూపాయల భారం మోపిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరింత భారాలు మోపడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. పంపిణీ సంస్థల ప్రతిపాదనలను గుడ్డిగా ఆమోదించడం, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోపోవటం బాధాకరమని పేర్కొన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ పేరుతో అధిక ధరలకు అవసరానికి మించి విద్యుత్ కొనుగోలు చేయటం వల్ల ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రజలపై భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు నిలిపివేయాలని, అదానీ సంస్థతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పశువధశాల అనుమతులన్నీ అక్రమమే

గో సేవా సమితి సభ్యుల ధ్వజం

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్వహిస్తున్న పశువధ శాలకు ఉన్నాయంటున్న అనుమతులు సక్రమంగా లేవని నిర్ధారణ అయ్యిందని గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి అనుమతులపై అభ్యంతరం తెలిపిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్‌వర్మ ఎదుట పశువధ సంస్థ జనరల్ మేనేజర్ అరవింద్ సరీన్‌తో సమావేశమయ్యామన్నారు. సంస్థ చూపిస్తున్న అనుమతి పత్రాలు సక్రమంగా లేన్నట్టు నిర్ధారణ అయ్యిందని, తక్షణమే కర్మాగారంలో కార్యకలాపాలు నిలిపివేయాలని తాము కోరామన్నారు. మాజీ ఏపీపీ వెలగల సాయిబాబారెడ్డి మాట్లాడుతూ పశువధ శాల నిర్వహణకు పంచాయతీ ఎన్‌ఓసీ అవసరం లేదని ఏ జీఓ చెబుతుందని, మూడో షెడ్డుకి రెసిడెన్షియల్‌గా అనుమతి పొంది పరిశ్రమకు ఎలా వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తుంటే 144 సెక్షన్ ఎలా విధించారని, గోసేవా సమితి సభ్యుడు శ్రీనివాస్‌ను ఎందుకు బైండోవర్ చేశారని నిలదీశారు. అయితే తహసీల్దార్ అశోక్‌వర్మ వీటికి సమాధానం చెప్పకపోవడం హాస్యాస్పదమన్నారు. పశువధశాలకు అండగా నిలుస్తున్న అధికారులు రాబోయే రోజుల్లో న్యాయస్థానం ముందు సమాధానం చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాది ఓఎస్ కృష్ణ, న్యాయవాది చోడే గోపి, బాధిత మహిళలు పాల్గొన్నారు.



తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న గోసేవా సమితి సభ్యుడు శ్రీనివాస్

క్లుప్తంగా

వేమూరి శ్రీనివాస్‌కు జాతీయ పురస్కారం



వేమూరి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన ప్రముఖ కవి వేమూరి శ్రీనివాస్‌కు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. తెలుగు సాహిత్యానికి వేమూరి చేస్తున్న సేవలను గుర్తించి శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలో పురస్కారం అందజేయనున్నారు.

మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కాపవరం సమీపంలో అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలి వచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, మినీ బస్సుల్లో భక్తులు తరలివచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మర్లగూడెం అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న పాటమ్మతల్లిని, పసుపులమ్మ తల్లిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెలించుకున్నారు.

అట్టహాసంగా తిరువీధి సేవ



ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నిత్యం చినవెంకన్న ఉభయ దేవేరులు, గోదాదేవితో క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్నారు. ఆదివారం నిర్వహించిన తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం స్థానిక ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

వేలేరుపాడు: వేలేరుపాడు మండలం మేడేపల్లిలో 35 తెలంగాణ మద్యం సీసాలను ఆటోలో తరలిస్తుండగా సీజ్ చేశారు. ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఆటోను సీజ్ చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. దాడులలో ఎస్సైలు ఎస్ఎస్ఎస్ సుబ్రమణ్యం, ఎ.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆకివీడు: మండలంలోని దుంపగడప మొండి గేటు సమీపంలో ఆదివారం రాత్రి పది గంటల ప్రాంతంలో పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొని 35 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. స్థానిక సంతపేటకు చెందిన వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.



కాంతులీనుతున్న శ్రీవారి క్షేత్రం

సంక్రాంతికి శ్రీవారి క్షేత్రం ముస్తాబు



భోగి మంటలు వేసేందుకు సిద్ధంగా..

సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలు జరిపేందుకు ఆలయ అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా శ్రీవారి కొండపైన షాపింగ్ కాంప్లెక్స్ వెనుక ఖాళీ ప్రదేశాన్ని ఆదివారం ముస్తాబు చేశారు. పల్లెల్లో సంక్రాంతి సంబరాలు ఎలా జరుగుతాయో కళ్లకు కట్టినట్లుగా చూపేందుకు అధికారులు శ్రమించారు. భోగి మంటలు వేసేందుకు కట్టెలు సిద్ధం చేశారు. ఆ ప్రాంతాన్ని మహిళలు రంగవల్లులతో తీర్చిదిద్దారు. పూరి గుడిసె, ఈత, తాడి చెట్లు, ఉయ్యాల, ఎడ్ల బండి, సంక్రాంతి విశిష్టతను తెలిపే చిత్రమాలికలు, రంగవల్లులతో గొబ్బిమ్మలు, చెరుకు గెడలు ఇలా పల్లె వాతావరణంలో సంక్రాంతి పండుగ జరిగే తీరును కళ్లకు కట్టినట్టు చూపేలా అన్ని ఏర్పాట్లు చేశారు. క్షేత్రంలో విద్యుద్దీప కాంతులు మిరమిట్లు గొలుపుతున్నాయి. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీవీ భాస్కర్, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ, ఏఈఓ వాసు తదితరులు సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సంక్రాంతి సంబరాలు జరిగే ప్రాంతంలో స్వాగత ద్వారం



పల్లె వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన పూరిగుడిసె, ఈత చెట్టు.



కొండపై రంగవల్లులు వేస్తున్న మహిళలు

కనుల పండువగా కుడారై ఉత్సవం



పారిజాతగిరిలో కుడారై మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవ కార్యక్రమంలో భాగంగా కుడారై మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రంగవల్లికలో అక్కారి అడిసెల్ విశేష ప్రసాదంను 108 పైగా గంగాలాలతో నింపి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి నివేదనగా సమర్పించారు. కుడారై ఉత్సవ ప్రాముఖ్యతను ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు వివరించారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరూ కుడారై వెల్లుంసీర్ గోవిందా అనే పాశురాన్ని వినిపించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వికాస్ తరంగిణి సభ్యులు ఆర్‌ఎస్ఎస్వీ అప్పారావు, శ్యామలాంబ నరసవేని, తులసి రత్నం, మహాలక్ష్మి, కర్పూరం రవి, శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు. గోదా శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, పసుపు కొట్టే కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవ ముగింపు కార్యక్రమగా సోమవారం ఉదయం 10:30కు నిర్వహిస్తారు.

ఏలూరు నగరంలో భారీ చోరీ

జ్యుయలరీ షాపులో బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని జ్యుయలరీ షాపులో భారీ చోరీ జరిగింది. దుండగులు షాపు వెనుక గోడకు రంధ్రం చేసుకుని లోనికి ప్రవేశించారు. భారీగా బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయినట్లు తెలుస్తోంది. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా బాషా సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేయటంతో క్లూస్‌టీం రంగంలోకి దిగింది. పోలీస్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు ప్రారంభించారు. వన్‌టౌన్ ప్రాంతంలోని బంగారు దుకాణాల సముదాయంలో మామిళ్ళపల్లి రఘురామ్ లోకేశ్వరి జ్యుయలరీ షాపును నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణాన్ని మూసివేసి సెక్యూరిటీ డబుల్ షట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో అనుమానంతో 12 గంటలకు వచ్చి దుకాణాన్ని తెరిచి పరిశీలించేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెనుకభాగంలో గోడకు రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మొత్తం అపహరించుకుపోయారు. దొంగలు లోనికి వెళ్ళే ముందే సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎంతమేర నష్టం జరిగిందో ఇంకా స్పష్టత ఇవ్వలేదని పోలీస్ అధికారులు చెబుతున్నారు. కిలోకు పైగా బంగారం, 30 నుంచి 40 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది.



ఏలూరు వన్‌టౌన్ లోకేశ్వరి జ్యుయలరీ షాపులో చోరీ జరిగిన దృశ్యం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: గడ్డి మందు తాగి, ఆసుపత్రిపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. మండలంలోని చెక్కపల్లికి చెందిన మొక్కపాటి నాగేశ్వరరావు కుమారుడు సురేష్ (35) ఓ ప్రైవేటు కంపెనీ వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన కాటేపల్లి మహేష్ వద్ద రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2021లో వడ్డీతో కలిపి రూ.4,80,000 బాకీ తీర్చాడు. మరుసటి ఏడాది నుంచి మహేష్ ఇంకా రెండు లక్షలు బాకీ ఉన్నావు చెల్లించాలని సురేష్‌ను వేధిస్తున్నాడు. దీంతో సురేష్ గత డిసెంబర్ 22న మండల కేంద్రం ముసునూరులో గడ్డి మందు తాగాడు. మరుసటి రోజున గుర్తించిన బంధువులు అతనిని నూజివీడు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు.

గుర్తింపు కార్డు పేరుతో అక్రమ వసూళ్లు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఫొటో గుర్తింపు కార్డుల పేరుతో చేస్తున్న అక్రమ వసూళ్లు ఆపాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో సాగుతున్న ఈ అక్రమ తంతుపై సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు కార్డుకు రూ.60 చొప్పున వసూలు చేసుకునేలా అక్షయ కమ్యూనికేషన్ అనే ప్రైవేటు సంస్థకు పశ్చిమ గోదావరి జిల్లా డ్వామా పీడీ అనుమతివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబుకార్డులున్న ప్రతి ఒక్కరు ఉపాధిహామీ పనులకు అర్హులేనని, వారికి ఎలాంటి గుర్తింపు కార్డులు అవసరంలేదన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి కలెక్టర్ ఆదేశాలతో డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు సర్క్యులర్ జారీ చేయడంతో అక్రమ వసూళ్లకు తెరలేసిందన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పాలకొల్లు అర్బన్: ఇంట్లోకి చొరబడి మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన పాలకొల్లు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని అచ్చుగట్లపాలెం శివారు చిత్రాయిచెరువుగట్టుకు చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం బయటకు వెళ్లిన సమయంలో ఆయన భార్య లక్ష్మి ఒంటరిగా ఉందని గమనించిన యువకుడు ఆమె భర్త ఫోన్ నెంబరు అడిగారు. ఆమె ఫోన్ నెంబరు ఇచ్చే క్రమంలో యువకుడు ఆమె మెడలోని 4 కాసుల బంగారు గొలుసుని లాక్కుని పరారయ్యారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఫిర్యాదు

భీమవరం: భర్త, అత్తమామలు తనతో పాటు పిల్లల్ని ఇంటి నుంచి బయటకు గెంటేశారని భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి రాయలం గ్రామానికి చెందిన ఎం.కుమారి ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పారు. ఉపాధికి కువైట్‌కు పంపించి, సంపాదించిన నగదును వాడేసుకుని వేరొక మహిళతో తన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పేదలకు రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

తణుకు అర్బన్: రహదారులపై జీవిస్తున్న అనాథలు, పేదలకు కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. చలికాలం కావడంతో ఆదివారం రాత్రి తణుకు ఆర్వోబీ, రైల్వేస్టేషన్, బస్టాండ్, బస్ షెల్టర్లలో తలదాచుకున్న వారికి రగ్గులు అందజేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కారుమంచి యోహాన్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కారుమంచి శామ్యూల్, శ్రీను, ఉండ్రాజవరపు రాంచరణ్, తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



1977-78 బ్యాచ్ విద్యార్థులు

పెంటపాడు: మండలంలోని అలంపురం జెడ్పీ హైస్కూల్ 1977-78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణ ఆత్మీయంగా కలిశారు. ప్రత్తిపాడు, అలపురం, కృష్ణాయపాలెం, రాచర్ల గ్రామాలకు చెందిన విద్యార్థులు నేడు పలు వ్యాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సూరంపూడి సత్యనారాయణ, పీవీ స్వామి, పెనుమాక శామ్యూల్ సునీల్, వీవీ సూర్యనారాయణ, ధర్మారావు, శేఖర్, ప్రసాద్ తదతరులు ఆధ్వర్యంలో సాయంత్రం ఉత్సాహంగా గడిపారు.

ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు



రోగుల ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. ప్రతీ ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్య తణుకు, తేతలి ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు వైద్య సేవలు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఇంటికి పరిమితమైన రోగులు ఉచిత వైద్య సేవల కోసం 9985343530 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ వైద్య సేవల్లో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా బరుల ఏర్పాటు



అలంపురం ప్రాంతంలో సిద్ధం చేస్తున్న కోడిపందేల బరులు

పెంటపాడు: సంక్రాంతి వచ్చిందంటే చాలు. కోడిపందేల బరులు వేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్న అధికార యంత్రాంగం ఏమైపోయిందో తెలియడం లేదు. ప్రజలకు అవగాహన కల్పించే పేరుతో పెంటపాడు మండల సమావేశ మందిరంలో శుక్రవారం, శనివారం పోలీసు, రెవిన్యూ శాఖతో కలిసి వీఆర్వోలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. 24 గంటలు గడవక ముందే శనివారం నుండి యథేచ్ఛగా బరులు వేస్తున్నా పట్టించుకోవడం లేదు. అలంపురం హైవేకు ఆనుకుని బరులు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కొత్తపాడులో కోడి పందేల బరులు ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇరగవరం: కోడి పందేలు చట్టరీత్యా నేరమని, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరగవరం ఎస్సై జానా సతీష్ అన్నారు. ఆదివారం ఇరగవరం మండలంలోని కొత్త పాడు, గోటేరు, ఐనపర్రు, తూర్పు విప్పర్రు, ఒగిడి, రేలంగి గ్రామాల్లో కోడి పందేల కోసం బరులు సిద్ధం చేస్తుండగా మెరుపు దాడి చేసి వాటిని ధ్వంసం చేశారు. బరులు ఏర్పాటు చేస్తున్న చోట ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, జూదం, కోతాటా, గుండాట వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాల జోలికి పోవద్దని హితవు పలికారు. సంక్రాంతి పండుగను కుటుంబంతో సంతోషంగా చేసుకోవాలని సూచించారు.

పట్టణంలో సమస్యల వలయం





అమ్మ కాలనీ, మారుతినగర్‌లో ఖాళీ స్థలాలు, మట్టి ఇరుకు రోడ్లు

- అమ్మకాలనీ, మారుతినగర్‌లో అపారిశుద్ధ్యంతో ఇబ్బందులు
- ఎక్కడ చూసినా మట్టి రోడ్లు
- పట్టించుకోని అధికారులు





కదలని మురుగు బోదెలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలో పురపాలక సంఘం విఫలమవుతుంది. దీంతో వివిధ సమస్యలతో పురప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు అధ్వానంగా ఉండటంతో పట్టణ వాసులు అవస్థలు పడుతున్నారు. వన్ టౌన్‌లో స్థానిక 11వ వార్డు అమ్మ కాలనీ, మారుతీనగర్‌లో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. రోజు రోజుకూ టౌన్ విస్తరిస్తున్న, విస్తరణకు అనుగుణంగా ప్రజలకు కావాల్సిన అవసరాలు తీరడం లేదు. కుళాయిలు అందుబాటులోకి తీసుకురాకపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, రోడ్లు నిర్మించకపోవడం, ఖాళీ స్థలాలు, బురద గుంటలు, ఇలా అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనకమహాలక్ష్మి గుడి నుంచి కుంచనపల్లి మార్గంలో వాసవి టౌన్ షిప్ వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంది. ఎన్నో సంవత్సరాలుగా మారుతీ నగర్‌గానూ, అనంతర కాలంలో అమ్మ కాలనీగా పిలుస్తున్నారు.

కనిపించని అంతర్గత సీసీ రోడ్లు

ఈ ప్రాంతంలో ప్రధాన సీసీ రోడ్డు మార్గం తప్ప అసలు సీసీ అంతర్గత రోడ్లు లేవు. ఈ ప్రాంతంలో సుమారు 8 వరకు అంతర్గత రహదారులు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం సన్నపాటి మట్టి అంతర్గత రహదారులు, తూడు, తుప్పలతోను, ఎత్తు పల్లాలుగాను, గోతులు మయంతోను ఈ రాంతంలోని రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రహదారులు సరిగా లేకపోవడంతో పాదచారులతో పాటు ద్విచక్ర, ఇతర వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

స్లమ్ ఏరియాలు ఎక్కువే

అపరిశుభ్ర ఖాళీ స్థలాలు ఈ ప్రాంతంలో చాలా ఎక్కువ. అవి తూడు, తుప్పలతో ఉంటూ చెత్త కుప్పలుగా మారాయి. అయితే వాటిల్లోని వ్యర్థాల కోసం పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. అసలు ఈ ప్రాంతంలో పక్కా డ్రెయినేజీ అనేదే కనిపించదు. ఎక్కడకక్కడ వాడకం మురుగు నీరు ఖాళీ స్థలాల్లోకి చేరి నిల్వ ఉంటుంది. అక్కడే ఇంకిపోవడం లేదా మురుగు గంటల మాదిరిగా దర్శనమిస్తున్నాయి.

ఖాళీ స్థలాలను పట్టించుకోని వైనం

ఈ ప్రాంతంలో చాలా వరుక ఖాళీ స్థలాలున్నాయి. అయితే వాటి యజమానులు వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఆయా స్థలాల్లో మురుగునీరు చేరి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో మురుగు నీటి నిల్వలు కారణంగా దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ప్రతి రోజూ దోమల బెడదతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బంది ఈ ప్రాంతానికి అసలు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షకాలమైతే ఈ ప్రాంతంలో రహదారులు, ఖాళీ స్థలాలు ముంపునకు గురి కావడంతో రోజువారీ పనులకు వెళ్లడానికి ఇబ్బందిపడాల్సి వస్తుందని వాపోతున్నారు.

వీధి లైట్లు, మంచినీటి సమస్యలు

ఈ ప్రాంతంలో పలు చోట్ల వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు రాత్రి సమయాల్లో తిరిగేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాములు, విష కీటకాలతో కలిసి జీవించాల్సిన పరిస్థితి ఉంటుందని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ ప్రాంతంలో తాగునీటి కుళాయిలు లేవు. అక్కడ అక్కడ ఉన్నప్పటికి కుళాయిలు నుంచి నీరు అసలు రాదు. కొద్దిగావచ్చినా లీకేజీలు కారణంగా మురు గు నీరు వస్తుందని స్థానికులు వాపోతున్నారు. రానున్న వేసవిలో ఇబ్బందులు తప్పవని, బోరు వాటర్, ప్రైవేట్‌గా టిన్ వాటర్ వాడుతున్నామని చెబుతున్నారు. సక్రమంగా అందరికి నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని అప్పటి వరకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలని అక్కడ ప్రజలు కోరుతున్నారు.

మారుతినగర్, అమ్మ కాలనీలను అభివృద్ధి చేయాలి



మారుతీనగర్, అమ్మ కాలనీ వేగంగా విస్తరిస్తుంది. మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మట్టి రహదారులు, ఖాళీస్థలాలు ఎక్కువగా ఉండటం, డ్రెయినేజీలు లేకపోవడం, మురుగు కూపాలు, వర్షకాలం వస్తే ఈ మార్గంలో నడువలేకపోతున్నాం. దోమల బెడద అధికంగా ఉంది. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నజీముద్దీన్, మారుతి, అమ్మ కాలనీ

తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు



తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. చాలాచోట్ల మునిసిపల్ కుళాయి వ్యవస్థలేదు. అక్కడ అక్కడఉన్నా కుళాయినుంచి నీరు రాదు. కొన్ని సందర్భాలలో మురుగునీరు వస్తుంది. కొత్త పైప్ లైన్‌లువేసి మంచినీరు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. పారిశుద్ధ్య సిబ్బంది చేత్తసేకరణకు ఇళ్లకు అసలురారు. వార్డు ను తప్పనిసరిగా అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలి.

– బి.రాధకృష్ణ, మారుతి, అమ్మ కాలనీ

గ్రామాల్లో సంక్రాంతి సందళ్లు



రామన్నగూడెంలో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని వినాయకుడి గుడి సమీపంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బోణం యశస్విని ఆధ్వర్యంలో ఆదివారం గొబ్బిల్లు డ్యాన్స్‌తో ప్రారంభించి ఫ్యాషన్ షో, డ్యాన్స్ పోటీల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీటిని కేవలం సరదా కోసం కాకుండా ఆయా పోటీలుగా నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ముగ్గుల పోటీలు, చిన్నారులకు భోగిపళ్ల కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే పెదతాడేపల్లి గాయత్రీ బ్రాహ్మణ సేవా పరిషత్ కల్యాణ మండపం వద్ద ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గులు, వంటల పోటీలు నిర్వహించారు. బ్రాహ్మణ సేవా పరిషత్ అధ్యక్షుడు పుల్లాభొట్ల వెంకట సూర్యనారాయణమూర్తి, కోశాధికారి ప్రవా శ్రీనివాస్, కార్యనిర్వహణ కార్యదర్శి గరికపాటి బాపయ్య శర్మ, మల్లాది సూర్యకిరణ్, కొలచన ఆత్మారామ్ పాల్గొన్నారు.



పెదతాడేపల్లి గాయత్రీ బ్రాహ్మణ సేవా పరిషత్ కల్యాణ మండపం వద్ద సంక్రాంతి సందడి

అమ్మవార్ల ఉత్సవాలు ప్రారంభం



పెంట్లమ్మ అమ్మవారికి అభిషేకం చేస్తున్న దృశ్యం



రావిపాడులో ముత్యాలమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

పెంటపాడు: ఉమామహేశ్వరం గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి ఆలయ వార్షిక ఉత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంబమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారు జామున అమ్మవారికి మేలుకొలుపు సేవ, గరగల ఉత్సవాలు, మంగళ స్నానాలు చేయించారు. గ్రామంలోని కన్యలతో అమ్మవారికి అభిషేకం చేయించారు. రాయుడు శ్రీనివాసరావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రతీ ఏటా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. మరో రెండు రోజులు గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.

అలంపురంలో..

అలంపురం గ్రామ దేవత ముళ్లమ్మ వారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రజకచెరువు గట్టున ఉన్న అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు పురస్కరించుకుని భారీగా బాణసంచా కాల్చారు.

రావిపాడులో

రావిపాడు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం రాత్రి నుంచి గ్రామంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించబోయే ఈ ఉత్సవాలు పురస్కరించుకొని కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం రాత్రి బాణసంచా కాల్పులతో పాటు ఉత్సవ సామగ్రితో అమ్మ వారికి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

నేటి నుంచి మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరితోట మహంకాళమ్మ ఆలయ వార్షిక మహోత్సవాలు 13వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమై జనవరి 22వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు యెగ్గిన నాగబాబు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం కలశస్థాపన, అమ్మవారికి సారె, చీర బహుకరణ, గరగల నృత్యం, నాసిక్ బ్యాండ్, నృత్య ప్రదర్శనలు, రథోత్సవం, మ్యూజికల్ కోలాటాలు ఉంటాయని తెలిపారు.

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం



నిట్‌లో వివేకానంద జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: భారతదేశం గర్వించదగ్గ మహనీయుడు వివేకానంద అని, ఆయన బోధనలు అందరికి స్ఫూర్తిదాయకమని నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. ఏపి నిట్‌లో ఆదివారం జరిగిన వివేకానంద జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని , సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. వివేకానందుని బోధనలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్వామి వివేకానందకు ఘన నివాళి



తణుకులో స్వామి వివేకానంద జయంతిని నిర్వహిస్తున్న నాయకులు



ఏడో వార్డులో వివేకానంద స్వామి జయంతి

తణుకు అర్బన్: మనిషి కర్మ భక్తి యోగ జ్ఞానమార్గాల్లో పయనించడమే మానవ ధర్మమని బీజేపీ తణుకు పట్టణ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు అన్నారు. స్వామి వివేకానందుడి 162వ జయంతి యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శక్తి సామర్థ్యాలను కూడగట్టుకుని లక్ష్యం వైపు అడుగులు వేస్తే విజయం స్వాగతిస్తుందన్నారు. బీజేపీ తణుకు నియోజకవర్గ కన్వీనర్ అయినంపూడి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో బీజేపీ తణుకు పట్టణ ఉపాధ్యక్షుడు రాసాబత్తుల అనుకుమార్, మంగరాతి నాగేశ్వరరావు, గంటా శరత్, ప్రధాన కార్యదర్శి రేపాక సూర్య రామారావు, కార్యదర్శి పైబోయిన సత్యనారాయణ, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి మణిదీప్, బడేటి సాయిరాం, మారిశెట్టి అజయ్, సోమ సుందరరాజు, శివ ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా వివేకానందుని జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 24వ వార్డులోని ఆచంట వారి వీధిలో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన వక్త బీజేవైఎం పత్సా గోపాలకృష్ణ హాజరై మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానంద అని కొనియాడారు. స్థానిక ఏడో వార్డులోని వివేకానంద స్వామి విగ్రహానికి పేరిచర్ల ఫౌండేషన్ అధినేత పేరిచర్ల మురళీకృష్ణంరాజు, పట్టణ ప్రముఖులు సీహెచ్ఏఆర్‌కే వర్మ, దాట్ల జగన్నాథరాజు, ధనబాబు, తదితరులు పూలమాలలు వేశారు. వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు.

ఘనంగా డాక్టర్ ఎల్లాప్రగడ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతిని కమ్యూనిటీ పారామెడికల్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల యూనిట్స్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. బోదకాలుకు ఔషధం హెట్రోజెన్, యాంటీబయాటిక్ టెట్రాసైక్లిన్, క్షయను కట్టడి చేసే ఐసోనికోటిన్ యాసిడ్ హైడ్రాజైడ్, క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే మైథోట్రెక్సేట్ ఇలా ఎన్నో ఔషధాలతో మానవాళిని రక్షించిన మహనీయుడని కొనియాడారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, అసోసియేషన్ సెంట్రల్ సెక్రటరీ వీబీటీ రాజు, వైద్యులు రమ్య శృతి, జన విజ్ఞాన వేదిక సభ్యులు పత్తి వీరాస్వామి తదితరులు పాల్గొని ఎల్లాప్రగడ సేవలను కొనియాడారు.

జోరుగా సంక్రాంతి సామగ్రి విక్రయాలు

తణుకు అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా తణుకులో సామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా భోగి మంటకు వినియోగించే ఆవు పేడతో తయారు చేసే భోగి పిడకలు ఈ ఏడాది మార్కెట్‌ను ముంచెత్తాయి. ప్రధాన రహదారుల్లో ప్రత్యేక దుకాణాలతో పాటు ఫ్యాన్సీ, కిరాణా దుకాణాల్లో సైతం భోగి పిడకల అమ్మకాలు చేపట్టారు.

పాల ఉత్పత్తుల పెంపునకు కృషి

తాడేపల్లిగూడెం రూరల్: పాల ఉత్పత్తులను పెంపొందించే దిశగా ప్రభుత్వం గోకులాలను అభివృద్ధి చేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కడియద్ద గ్రామంలో నిర్మించిన మినీ గోకులాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు మోక్షం ఎన్నడో..!

- ఆరు నెలలైనా తెరుచుకోని ప్రభుత్వ సైట్
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు, పింఛన్లు నిరంతర ప్రక్రియ



మండలంలోని గ్రామ సచివాలయం

ఇరగవరం: దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వృద్ధులు, భర్త చనిపోయిన వితంతువులు, నడవలేని దివ్యాంగులు, ప్రభుత్వం మంజూరు చేసే సామాజిక పింఛన్ల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని, మళ్లీ రావాలని సచివాలయ ఉద్యోగులు చెబుతుండడంతో అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగేదని, కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం సైట్ ఓపెన్ చేయకుండా కాలయాపన చేస్తుంది. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే క్రమంలో నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా వివాహాలైన వారు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు కూడా ప్రభుత్వం ఎప్పుడు కురుణిస్తుందా అని ఎదురు చూపులు చూస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌తో సైట్ బ్రేక్

గత ఏడాది ఏప్రిల్ 18 నుంచి ఎన్నికల నోటిఫికేషన్‌తో బ్రేక్ పడిన సైట్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం ఏమిటని ప్రజలు సచివాలయాలకు వెళ్లి అడుగుతున్నారు. గత జూన్ 12న కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు తీసుకునేందుకు 60 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, కొత్తగా వివాహాలు చేసుకున్న వారు కొత్త రేషన్ కార్డుల కోసం ఇలా ఎందరో ప్రభుత్వం సైట్‌కు ఎప్పుడు అనుమతిస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తే భూ సమస్యల కంటే రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ఎక్కువగా అర్జీలు అందాయి.

గత ప్రభుత్వంలో సులభ మార్గం

గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో వారు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి, వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్ కార్డులు ఇంటి వద్దకే తీసుకొచ్చి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త పింఛన్ల, రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం ఇవ్వకపోవడంతో అర్హులు పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.